సాక్షి
నిజామాబాద్

బుధవారం । 1 । మార్చి । 2023



'కంటివెలుగు'లో చేతివాటం

కంటివెలుగు శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా మెడికల్ ఆఫీసర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

- 8లో ▸



రామానుజన్‌ను స్ఫూర్తిగా..

విద్యార్థులు గణిత శాస్త్రవేత్త రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఓయూ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.7 /20.3

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. సాయంత్రం ఈదురు గాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బీర్కూర్‌కు సీఎం రాక



సాక్షి, కామారెడ్డి : బీర్కూర్‌లోని తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రానున్నారు. బుధవారం ఉదయం 9.50 గంటలకు బేగంపేటలోని ప్రగతి భవన్ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45కు బాన్సువాడ పట్టణంలోని అంగడిబజార్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిమ్మాపూర్‌లోని ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, అక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నారు.

చికెన్ వ్యర్థాలపై మున్సిపల్ కమిషనర్ సీరియస్

- తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..



నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ నగరంలో చికెన్ వ్యర్థాలను బాసర గోదావరి నదిలో పడేసి అపవిత్రం చేస్తున్నారని 'సాక్షి'లో ఈనెల 27న ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ చిత్రా మిశ్రా స్పందించారు. ఎంహెచ్‌వో, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంటనే మీ ప్రాంతాల్లో పర్యటించి చికెన్ వ్యర్థాలు తీసుకెళ్లి గోదావరి కలుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీజోన్ కార్యాలయాల పరిధిలో ఉన్న చికెట్ షాప్‌లను తనిఖీ చేసి జరిమానాలు వేయాలని, లేకుంటే కచ్చితంగా ఆయా ఎస్సైలకు మెమోలిచ్చి శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తవ్వాలి



నిజామాబాద్ నాగారం : నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వైకుంఠధామాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. నూతన మున్సిపల్ భవనం తుది దశకు చేరిందన్నారు.అహ్మదీబజార్‌లో సమీకృత మార్కెట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ ప్రవీణ్, సంబంధిత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పసుపు రైతుకు స్వల్ప ఊరట

- క్వింటాలుకు రూ. 6 వేలకు పైగా పెరిగిన ధర



బాల్కొండ : పసుపు పంట సాగు చేసి మార్కెట్‌కు తరలించిన రైతుకు మంగళవారం మార్కెట్‌లో స్వల్పఊరట లభించింది. వారం రోజులుగా మార్కెట్‌లో కొమ్ముకు క్వింటాలుకు రూ. 6 వేలకు పైగా ధర పలుకుతుంది. దుంపలకు రూ.5వేల పైన ధర పలికింది. గతనెల క్రితం కూడా వారం రోజుల పాటు ఇలానే ధర పెంచి మళ్లీ పసుపు తగ్గించారు. గతేడాది చివరిలో క్వింటాలుకు 8,500 వరకు ధర గరిష్టంగా పలికింది. అలాగే జొన్న పంటకు ప్రారంభంలో క్వింటాలుకు రూ. 4,200 పెట్టి కొనుగోలు చేసిన వ్యాపారులు వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ. 3,800కు తగ్గించారు. దీంతో రైతులు జొన్నపంటను అమ్మకపోవడంతో మళ్లీ ధర పెంచారు. బాల్కొండ నియోజక వర్గంలో ఓ గ్రామంలో క్వింటాలుకు రూ. 3,910 కొనుగోలు చేసేందుకు ఓ వ్యాపారి రైతులతో ఒప్పందం చేసుకున్నాడు.

షాడో ఏలుబడి..!



నిజామాబాద్ నగరంలోని ప్రధాన ప్రజాప్రతినిధి సోదరుడి అక్రమాలకు అంతులేకుండా పోయింది. భూ కబ్జా దందాలో అక్రమార్కులకు అండగా నిలవడం..సెటిల్‌మెంట్ల కేసుల్లో పోలీసులపై ఒత్తిడి తేవడం వ్యాపకమై పోయింది. ఇదంతా ప్రజాప్రతినిధికి షాడోగా వ్యవహరిస్తూ కొనసాగిస్తున్న వ్యవహారం..

ఎమ్మెల్యేకు అప్రతిష్ట

- అంతా తానైన ప్రజాప్రతినిధి సోదరుడు
- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న వైనం
- నగర ప్రజాప్రతినిధులకూ తప్పని తిప్పలు
- బాధితులను ఎమ్మెల్యే దరికి చేరనీయకుండా అడ్డగింతలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలో భూదందా, కబ్జాల విషయంలో కొందరు అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అలాంటి వాళ్లకు ప్రధాన ప్రజాప్రతినిధి సోదరుడు అండగా నిలబడుతుండడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలో బాధితులు దిక్కుతోచని స్థితిలో గగ్గోలు పెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉందంటే నగరంలో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం అనేక తిప్పలు పడుతున్నారు. నగరంలో ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులను సైతం ఇబ్బందులు పెట్టిన పరిస్థితి నెలకొనడం గమనార్హం. ఇదిలా ఉండగా నగరంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు ప్రధాన ప్రజాప్రతినిధి సోదరుడి అండతో భూదందా, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులకు సైతం ప్రధాన ప్రజాప్రతినిధి అనుచరుడు ఆదేశాలు జారీ చేస్తుండడం విశేషం. మరో అంశంలో ఇద్దరు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఓ వ్యక్తి వద్ద రూ.5.50 లక్షలు తీసుకుని మోసం చేయగా, సదరు బాధితుడు తన గోడు చెప్పుకునేందుకు ఎమ్మెల్యే వద్దకు వచ్చే ప్రయత్నం చేయగా సదరు షాడో అడ్డుకుని తిప్పి పంపడం గమనార్హం. నగరంలో కొద్ది నెలల క్రితం అగ్నిప్రమాదంలో కాలిపోయిన సూపర్‌మార్కెట్‌కు సంబంధించి సెటిల్‌మెంట్ చేసే విషయంలో రూ.10 లక్షలు తీసుకుని పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్‌లో ముఖ్య ప్రజాప్రతినిధి కుమారుడు ఓ ప్రభుత్వ ఉద్యోగి. అతనికి ఈ రాజకీయాలు, దందాలతో ఎలాంటి సంబంధం లేదు. అతను బ్యాంకు రుణంతో, కష్టపడి హైదరాబాద్‌లో ఓ ఇల్లు కొనుక్కున్నాడు. ఇల్లు కొనుక్కున్నందుకు సైతం ఈ షాడో తనకు మామూలు కావాలని అడగడంతో వాపోతున్నారు. పైగా సదరు ముఖ్య ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల కదలికల గురించి ఎప్పటికప్పుడు ఈ షాడో ఆరా తీస్తుండడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. కొందరు కార్పొరేటర్లు ప్రతి నెలా మామూళ్లు ఇవ్వాల్సిన పరిస్థితి. ఇటీవల ఓ మాజీ కార్పొరేటర్ భర్త ఐఫోన్ కొనివ్వడం జరిగింది. ఈ షాడో కుటుంబం నగరంలోని ఏదైనా హోటల్‌కు వెళితే అన్ని ఖర్చులు ఆ ఏరియా పోలీసులు భరించాల్సిన పరిస్థితి. ఇక మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇతని పిల్లలను రోజూ కారులో పాఠశాలలో దించాలి. మరో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇంట్లో పనులు చేయాలి. ఇవన్నీ ఇలా ఉండగా, దళితబంధు యూనిట్లు పొందిన లబ్ధిదారుల నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఇక నగరంలో రెండు వైన్స్‌లో ఈ షాడో భాగస్వామిగా ఉండగా, ఈ దుకాణాల్లో ఎలాంటి నిబంధనలు పాటించరు. ఇంకా పలు వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అప్రతిష్ట మూటగట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది.

'నకిలీ' కేసులో మరి కొందరు!

- అక్రమార్కుల పట్టాల దందాపై కొనసాగుతున్న పోలీసుల విచారణ
- రిమాండ్ రిపోర్ట్‌లో 12 మంది
- పాత్రదారులు సరే.. సూత్రధారులేరి ?

ఖలీల్‌వాడి : ఇందూరులో నకిలీ పట్టాల బాగోతం బద్దలైంది. ఇటీవల ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, రిమాండ్ రిపోర్టులో మొత్తం 12 మందిని చేర్చారు. విచారణను పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి నిర్వహిస్తున్నారు. రిమాండ్ రిపోర్టులో ఉన్న పేర్లే కాకుండా విచారణలో వచ్చిన వారి పేర్లను ఈ కేసులో చేర్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. పోలీసులు పేర్లను చేర్చడానికి కోర్టులో పిటిషన్ వేస్తారని తెలుస్తోంది. సీపీ కేఆర్ నాగరాజు ప్రత్యేక దృష్టి సారించడంతో నకిలీ పట్టాల వ్యవహారం బయటకు వచ్చినట్లు తెలిసింది. ఈ కేసులో పాత్రదారులు అరెస్ట్ కావడంతో అసలు సూత్రధారులు బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ సిబ్బంది, రిజిస్ట్రేషన్, మీసేవా సిబ్బందితో పాటు పలువురు పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. ఈ కేసులో ఓ ప్రజాప్రతినిధి సోదరుడితో పాటు అతనికి అత్యంత సన్నిహితంగా ఉండే ఇద్దరు నాయకులు, ఇద్దరు రిపోర్టర్లు ఉంటారో లేదో అనే చర్చ ఇప్పుడు నగరంలో జోరుగా సాగుతోంది. భూకబ్జాలపై ఓ ప్రజాప్రతినిధి సోదరుడితో ఓ ప్రధాన పత్రిక రిపోర్టర్ అర్ధరాత్రి రహస్యంగా సమావేశాలు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం, రాజకీయ ఒత్తిడితో పనులు చేయించుకుని ఈ కేసులో అధికారులను బలి పశువులను చేశారనే విమర్శలు వస్తున్నాయి. వీరి అక్రమాలపై అధికారుల మీద ఎవరు ఒత్తిడి చేశారనే విషయాన్ని స్పష్టం చేస్తే సూత్రధారుల పేర్లు నిర్ధారణ అయ్యే అవకాశం ఉంది. పోలీసులు నిజానిజాలను నిగ్గు తేల్చితే ప్రభుత్వభూమి, వారసులు లేని భూములు, కబ్జా చేసిన భూముల వివరాలు బట్ట బయ లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇద్దరికి కండీషనల్ బెయిల్ మంజూరు..

నకిలీ పట్టాల వ్యవహారంలో రిమాండ్‌కు తరలించిన అమర్‌సింగ్‌తో పాటు సుదర్శన్‌కు నిజామాబాద్ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌందర్య కండీషన్‌తో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు. సారంగపూర్ జైలు నుంచి ఇద్దరు మంగళవారం సాయంత్రం విడుదలయ్యారు. ఈ కండిషనల్ బెయిల్ ప్రకారం నిందితులు బుధ, శని వారాలో 3వ టౌన్ పీఎస్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. నిజామాబాద్ న్యాయపరిధి విడిచి వెళ్లరాదు.

ఆర్యనగర్‌లో ఫేక్‌సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్

నగరంలోని ఆర్యనగర్‌లో ఇంటి స్థలం అమ్మడానికి ఇచ్చిన డాక్యుమెంట్‌తో పాటు ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్న బాగోతం ఒకటి బయట పడింది. ఇందుకు ఈ స్థలానికి సంబంధించిన ఓనర్లు మృతి చెందినట్లు నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి డబ్బులు దండుకున్నారు. తాజాగా ఈ ఘటన జరగడం మరింత చర్చనీయంశంగా మారింది. నగరంలో ఒకవైపు నకిలీ పట్టాల కలకలం రేగుతుండగా, మరో వైపు ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న విషయం తెలిసిన బాధితులు 4వ టౌన్ పీఎస్‌ను ఆశ్రయించి, ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నకిలీ పట్టాల వ్యవహారంలో రిమాండ్ రిపోర్టులో చేర్చిన 12 మందిపై 3 టౌన్ పీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. కేసులో ఉన్న అధికారులకు నోటీసులు జారీ చేసిన అనంతరం పోలీసులు చర్యలకు ఉపక్రమిస్తారని తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం

సుభాష్‌నగర్ : నకిలీపత్రాల కేసు రిమాండ్ రిపోర్ట్‌లో ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్ల పేర్లు పొందుపర్చడంతో రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం మొదలైంది. రిమాండ్ రిపోర్ట్‌లో ప్రస్తుతం పని చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు సతీశ్, సురేశ్, వాసుకీ పేర్లు ఉండడం చర్చనీయాంశమైంది.

సొసైటీలో అక్రమాలపై విచారణ

కలెక్టర్‌కు నివేదించనున్న ఆర్డీవో రవి



సొసైటీలో విచారణ జరుపుతున్న ఆర్డీవో రవి

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై ఆర్డీవో టీ రవి విచారణ జరిపారు. సొసైటీ సీఈవో రాజు, క్లర్క్ భాస్కర్ నిధుల దుర్వినియోగానికి పాల్పడటం, రైతుల ధాన్యం డబ్బుల్లో కోత విధించటం, క్రాప్ పంటలపై మాఫీ అయిన రుణాలు కాజేయటం వంటి ఆరోపణలు రావటంతో వారిని ఇదివరకే డీసీవో సింహాచలం సొసైటీ తీర్మానం మేరకు సస్పెండ్ చేశారు. సొసైటీలో అక్రమాలపై విచారణ చేయాలని సొసైటీ పాలకవర్గం, రైతులు గత కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేయగా, ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ ఆర్డీవో రవి సొసైటీలో విచారించారు. సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, రైతుల నుంచి అక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడేళ్ల క్రితం తనకు క్రాప్‌లోన్ మాఫీ అయితే సీఈవో రాజు తనవద్ద వడ్డీ వసూలు చేశాడని గోపు రాము అనే రైతు ఫిర్యాదు చేశాడు. సొసైటీకి 76 బస్తాలు తెస్తే రైస్‌మిల్లుకు పంపి ఇప్పటికీ ఆ డబ్బులు ఇవ్వలేదని పానుగంటి రాజు అనే రైతు ఫిర్యాదు చేశారు. గతేడాది 1300 వరి ధాన్యం బస్తాలను సీఈవో కుర్నాపల్లిలోని తన బామ్మర్ది అకౌంట్ ద్వారా వేరే సొసైటీలో విక్రయించి వచ్చిన కమిషన్‌ను స్వంతానికి వాడుకున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. బస్తాకు 2 కిలోల చొప్పన కోత విధించి ఆ డబ్బులు కాజేశారని రైతులు వాపోయారు. ఈ విషయమై రెండురోజుల తర్వాత లోతైన విచారణ జరుపుతామని, అక్రమాలపై కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో పేర్కొన్నరాఉ. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు యెండల సంతోష్, నరేందర్, ప్రదీప్, బంటు రామరాజు, నవీన్, రైతులు ఆకుల పాపయ్య, సాయిలు, రాము, పెద్ద ఒడ్డెన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన డీటీసీ వెంకటరమణ, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

సుభాష్‌నగర్ : రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రత జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. పోలీస్, రవాణ, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. జిల్లామీదుగా రెండుజాతీయ రహదారులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు కలెక్టర్‌కు సూచించగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్‌స్పాట్లుగా పరిగణిస్తూ, ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులకు కారణాలు గుర్తించాలన్నారు. పోలీస్, ఆర్‌అండ్‌బీ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జాయింట్ సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాకేంద్రంతో పాటు ఇతర పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డివైడర్లు, ఐలాండ్‌ల వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను గుర్తించాలన్నారు. నగరంలో వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీటీసీ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లకు సోలార్ సొబగులు

- జిల్లాలో 1,210 యూనిట్ల ఏర్పాటు లక్ష్యం
- సబ్సిడీపై ఎస్‌హెచ్‌జీలకు స్త్రీనిధి రుణాలు
- ఇప్పటివరకు 82 మంది సభ్యుల గుర్తింపు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



బోధన్ మండలం మినార్‌పల్లిలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : పొదుపు సంఘాల్లోని మహిళలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించడానికి గ్రామీణాభివృద్ధి శాఖ కృషి చేస్తోంది. స్త్రీనిధి రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు సొంతంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే విధంగా పథకాన్ని రూపొందించింది. టీఎస్ రెడ్‌కో అందిస్తున్న సబ్సిడీ సహకారంతో పేద, మధ్య తరగతి ఇళ్లలో సోలార్ యూనిట్లు నెలకొల్పడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే బోధన్ మండలం మినార్‌పల్లిలో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. జిల్లాలో 1,210 యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 82 మంది గుర్తించారు.

అయితే, ఇళ్లపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి పొదుపు సంఘాల్లోని మహిళలు మరింత మంది ముందుకు వచ్చేలా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గ్రామీణా ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏపీఎంలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు మహిళా సంఘాలతో సమావేశమై సోలార్ యూనిట్‌తో కలిగే లాభాలను వివరిస్తున్నారు. ప్రతి అసిస్టెంట్ మేనేజర్‌కు 30-50 యూనిట్లు టార్గెట్‌ను విధించారు. ఆర్‌సీసీ ఇళ్లకు 160-200 చదరపు అడుగులతో కూడిన స్లాబు దాబా ఉండాలి. 2,3 కిలోవాట్స్ సామర్థ్యంతో కూడిన సోలార్ ప్యానల్ యూనిట్‌ను ఎంపిక చేసుకోవాలి.

లాభాలు ఇలా..

సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం రెడో కో ద్వారా సబ్సిడీ ఇస్తుండగా, స్త్రీనిధి ద్వారా రుణం లభిస్తుంది. 2కిలోవాట్స్ యూనిట్ విలువ రూ.1,42,200 ఉండగా, రూ. 39,200 సబ్సిడీ వస్తుంది. 3కిలోవాట్స్ యూనిట్ విలువ రూ.1,92,360 ఉండగా, రూ.57,360 సబ్సిడీ రానుంది. కాగా, నచ్చిన కంపెనీలను లబ్ధిదారులే ఎంపిక చేసుకోవచ్చు. మహిళలకు భారం కాకుండా స్త్రీనిధి ద్వారా రుణం అందించి నెల వారీగా వాయిదాలు చెల్లించే అవకాశముంది. విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు ఎన్పీడీసీఎల్‌కు అమ్ముకునే వెసులుబాటు కూడా ఉంది. రెండు కిలోవాట్ల యూనిట్ ద్వారా రోజుకు 8 యూనిట్ల విద్యు త్ ఉత్పత్తి అవుతుంది. అలాగే మూడు కిలోవాట్స్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే రోజుకు 12 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి కానుంది. సోలార్ తో నిర్వహణ ఖర్చులు ఉండకపోగా, పెట్టిన పెట్టుబడి ఐదేళ్లలో తీరిపోనుంది. సోలార్ ప్యానల్ వారెంటీ 25 ఏళ్లు ఉండగా, యూనిట్ వారెంటీ ఐదేళ్ల వరకు ఇస్తున్నారు.

మహిళలు ముందుకు రావాలి



జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు సోలార్ యూనిట్లు మంజూరు చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే 82 మంది ముందుకొచ్చారు. కొంతమందికి స్త్రీనిధి ద్వారా రుణం మంజూరు కాగా, గ్రౌండింగ్ నడుస్తోంది. విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవడానికి సోలార్ యూనిట్ల ఏర్పాటుకు మరింతమంది ఎస్‌హెచ్‌జీ మహిళలు ముందుకు రావాలి.

– రామ్‌దాస్, స్త్రీనిధి ఆర్‌ఎం, నిజామాబాద్

సోలార్ యూనిట్ల వివరాలిలా..

యూనిట్ కెపాసిటీ	ప్రాజెక్టు విలువ (రూ.లలో)	సబ్సిడీ (రూ.లలో)	దరఖాస్తు రుసుం	నెట్ మీటర్ చార్జీలు	నికరంగా సభ్యులు చెల్లించాల్సింది	స్త్రీనిధి రుణం	సభ్యురాలి వాటా	నెలవారీ వాయిదా
2కిలోవాట్స్	1,42,200	39,200	2,360	2,950	1,03,000	1,00,000	3,000	2,243
3కిలోవాట్స్	1,92,360	57,360	3,450	2,950	1,35,000	1,25,000	10,000	2,803

కార్పొరేషన్‌లో కలెక్షన్ కింగ్‌లు

భూమి పూజ చేశారని తెలిస్తే వాలిపోతున్నారు.. పునాది పడితే చాలు పీక్కుతింటున్నారు.. ఇంటికో రేటు.. అపార్ట్‌మెంట్‌కు ఒక రేటు.. ఇలా ఎంతోకొంత సెటిల్ చేయమంటారు.. ఇవ్వబోమంటే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, సిబ్బందిని ఇంటి మీదికి పంపుతారు. ఇలా నగరంలోని కార్పొరేటర్ల దందా ఇష్టారాజ్యంగా సాగుతోంది. కొత్త భవనాలు నిర్మిస్తే చాలు అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతూ గుండాగిరీ చేస్తున్నారు.

- నిర్మాణాలు చేస్తే.. ముడుపులివ్వాల్సిందే
- అనుమతులున్నా.. లేకున్నా కమీషన్లు తప్పనిసరి
- లేకుంటే అడుగడుగునా అడ్డంకులు
- ఎమ్మెల్యే, ఎంపీ సీరియస్ వార్నింగ్‌లు ఇచ్చినా మారని తీరు

నిజామాబాద్‌నాగారం : ప్రజా సమస్యలు పరిష్కరించరించాల్సిన కార్పొరేటర్లుఅడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నో హామీలతో గెలిచిన కార్పొరేటర్‌లు వసూల్ రాజాలుగా అవతారం ఎత్తారు. ప్రతి పనికి ఒక రేటు నిర్దేశించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. తాజాగా నగరంలోని ఓ డివిజన్ కార్పొరేటర్ తన డివిజన్ పరిధిలోనే ఇంటి నిర్మాణం వద్దకు వెళ్లి రూ. లక్ష డిమాండ్ చేసిన వీడియో వైరల్ కావడంతో పాటు సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే.

కార్పొరేషన్ అధికారుల సహకారం..

కార్పొరేటర్లకు ఇవ్వాల్సిన మామూలు ఇస్తేనే ఎలాంటి అడ్డంకులు లేకుండా ఇంటి నిర్మాణం జరిగిపోతుందని భరోసా కల్పిస్తారు. ఒకవేళ కాదంటే నిర్మాణాలకు ఆటంకాలు కల్పిస్తారు. కార్పొరేటర్లు హుకూం జారీచేసిన వెంటనే కార్పొరేషన్‌కు సంబంధించిన అధికారులు అక్కడికి చేరుకొని ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడం ఆనవాయితీగా మారుతోంది.

అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్ల పరస్పర సహకారంతో అక్రమ వసూళ్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. కొందరు కార్పొరేటర్ల అయితే తమ అనుచరులతో ఓ ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసుకుని అక్రమ వసుళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బాధితులు ఫిర్యాదు చేస్తే తమ ఇళ్ల నిర్మాణాలు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని ఊరుకుంటున్నారు.

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల వసూళ్లపై ఆరా!

తాజాగా అక్రమ వసూళ్ల కోసం బెదిరించిన సదరు కార్పొరేటర్‌పై అర్బన్ ప్రజాప్రతినిధి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విషయం అధికార పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో ఎక్కువ మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తమ పరిధిలో వసూళ్లకు పాల్పడుతూనే ఉన్నారని పలువురు చర్చించుకుంటున్నారు. తమ డివిజన్‌లో సమస్యలు పట్టించుకోకుండా వసూళ్ల పర్వానికి తెరలేపుతున్నారు.

బీజేపీలో..

ఇటీవల బీజేపీకి చెందిన ఒక కార్పొరేటర్ తన అనుచరులను వసూళ్ల దందాకు ఉపయోగించుకుంటున్నారు. ఎక్కడ ఇంటి నిర్మాణం జరిగినా కార్పొరేటర్ మనుషులు అక్కడ వాలిపోయి డబ్బులు డిమాండ్ చేస్తారు. ఇదిలా ఉండగా అక్రమ కట్టడాల నిర్మాణంలోనూ కార్పొరేటర్లది అందె వేసిన చేయి. కార్పొరేషన్ నుంచి అనుమతులు పక్కకు పెట్టి ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇక్క అధికారులు ప్రేక్షకపాత్రే వహిస్తున్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ కట్టడాలు మితిమీరిపోతున్నాయి. దీంతో కార్పొరేషన్ భారీగా ఆదాయాన్ని సైతం కోల్పోతోంది. కార్పొరేటర్ల పైరవీలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఏదైనా పని కోసం సామాన్యులు కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్తే రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. కార్పొరేటర్లు చెబితేనే మీ పని జరుగుతుందని అధికారులు ఉచిత సలహా ఇవ్వడం గమనార్హం.

క్లుప్తంగా

వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడిగా గౌతం ప్రసాద్



బోధన్: మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన నింబూరి గౌతం ప్రసాద్ వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా.. మంగళవారం ఆయన తెలిపారు. ప్రస్తుతం గౌతంప్రసాద్ పార్టీ బోధన్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా కొనసాగుతున్నాడు. ఆయన నియామకంపై పారీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



ఖలీల్‌వాడి: అర్బన్ నియోజకవర్గంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ అర్బన్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బుస్సాపూర్ శంకర్ పేర్కొన్నారు. నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఆయన నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు పోరాడాలన్నారు. ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్ మహమ్మద్, బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు హనుమయ్యా, నగర పార్టీ అధ్యక్షులు కస్తూరి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన పరీక్షలకు 83 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యా శాఖ అధికారి రఘురాజ్ తెలిపారు. ఉదయం పరీక్షకు జనరల్ విద్యార్థులు 1108మందికి గాను 1077మంది హాజరయ్యారు. ఒకేషనల్ 374 మంది విద్యార్థులకు గాను 349 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్ 619మంది విద్యార్థులకు గాను 604 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 328మంది విద్యార్థులకు 316మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్న య్య, కనకమహాలక్ష్మి, హైపవర్ కమిటీ సభ్యులు రాజీయుదిన్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కూడా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

ధర్పల్లి: మండలంలోని దమ్మన్నపేట్, దుబ్బాక్, ధర్పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం మన ఊరు మనబడి కింద కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు సావిత్రి, శ్రీనివాస్ ఉన్నారు.

‘4న ఇంటర్ విద్యార్థులకు పరీక్ష’

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 4న ‘నైతికత – మానవ విలువలు’, 6న ‘పర్యావరణ విద్య’ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదివరకే జవాబు పత్రాలను అన్ని పరీక్ష కేంద్రాలకు పంపించామని, ప్రశ్నాపత్రం అదేరోజు నెట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు అందించామన్నారు. విద్యార్థులు విధిగా రెండు పరీక్షలు రాయాలన్నారు. జిల్లాలోని 116 పరీక్ష కేంద్రాలలో మొత్తం 17,503 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

గ్రంథాలయాలపై పట్టింపేది?

- గ్రంథపాలకులను నియమించని రాష్ట్ర ప్రభుత్వం
- సిబ్బంది కొరతతో మూతపడుతున్న వైనం



అచ్చంపేటలో మూతపడిన గ్రామీణ గ్రంథాలయం



నిజాంసాగర్‌లో తాళం వేసి ఉన్న శాఖ గ్రంథాలయం

నిజాంసాగర్(జుక్కల్): ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు జ్ఞానోదాయన్ని కల్గించే విజ్ఞాన బండారాలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. జిల్లాలో గ్రంథపాలకులతో పాటు సిబ్బంది కొరత కారణంగా గ్రామీణ గ్రంథాలయాలు మూత పడుతున్నాయి. దీంతో గ్రంథ పఠనానికి అలవాటు పడిన మేధావులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రస్తుతం పోటీపరీక్షల కాలం..

జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గ్రంథాలయంతోపాటు శాఖ గ్రంథాలయాల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్‌తో పాటు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలకు సంబందించిన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కానీ పలు గ్రంథాలయాల్లో గ్రంథపాలకులు లేకపోవడం, శాఖ గ్రంథాలయాలు సమయపాలన పాటించకపోవడంతో నిరుద్యోగులు పుస్తక పఠనానికి దూరం అవుతున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రంథాలయాలు తెరచి ఉంచకపోవడంతో నిరుద్యోగ యువత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాల్లోని ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో ఇద్దరే గ్రంథపాలకులు..

జిల్లాలో సెంట్రల్ గ్రంథాలయంతో పాటు 18 శాఖ గ్రంథాలయాలు, 7గ్రామీణ గ్రంథాలయాలు ఉన్నాయి. కానీ జిల్లా వ్యాప్తంగా ఇద్దరు గ్రంథపాలకులు మాత్రమే ఉండటంతో వారి పర్యవేక్షణ కరువైంది. చాలా చోట్ల శాఖ గ్రంథాలయాలు రోజుల తరబడి మూసి ఉంటున్నాయి. అలాగే గ్రామీణ గ్రంథాలయాల్లో సిబ్బంది కొరతతో మూత పడుతున్నాయి. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామ గ్రామీణ రెండేళ్ల నుంచి మూతపడింది. దీంతో గ్రామంలోని నిరుద్యోగులు పుస్తక పఠనానికి దూరం అయ్యారు. ఇలా జిల్లా వ్యాప్తంగా గ్రంథ పాలకులు, పార్ట్‌టైం ఉద్యోగులు, వాచ్‌మెన్ల కొరతతో గ్రంథాలయాలు మూతపడుతున్నాయి.

ఖాళీలు ఇవే..

జిల్లాలో గ్రేడ్–2 లైబ్రేరియన్ రెండు పోస్టులకు గాను రెండూ ఖాళీగా ఉన్నాయి. అలాగే గ్రేడ్–3 లైబ్రేరియన్ 11 పోస్టులకు గాను 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు వాచ్‌మెన్లకు గాను ఇద్దరు వాచ్‌మెన్లు ఉన్నారు. అలాగే పార్ట్‌టైం వర్కర్లు 19 మందికి గాను ప్రస్తుతం 11మంది పని చేస్తున్నారు. దీంతో శాఖ గ్రంథాలయాలు సమయపాలన పాటించకపోవడం, గ్రామీణ గ్రంథాలయాలు అయితే మూతపడుతున్నాయి.

ఖాళీలను భర్తీ చేయాలి..

ప్రతీరోజు గ్రంథాలయానికి వెళ్లి వార్త పత్రిలను చదువుతాను. గ్రంథాలయానికి అరగంట నుంచి గంటసేపు టైం కేటాయిస్తున్నాను. కానీ గ్రంథపాలకులు లేకపోవడంతో గ్రంథాలయాలు సమయపాలన పాటించడం లేదు. పార్ట్‌టైం సిబ్బందికి వేతనాలు సక్రమంగా రాకపోవడంతో గ్రంథాలయాలు తెరువడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

– ఏసయ్య, రిటైర్డ్ కంట్రోలర్, నిజాంసాగర్

నదిలో నాణేల వేట





రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నదిలో ఆనవాయితీగా భక్తులు చిల్లర డబ్బులు వేస్తుంటారు. దీంతో కొందరు స్థానికులు తాళ్లకు అయస్కాంతాలను కట్టి, నదిలో అటూ ఇటూ తిరుగుతూ నాణేల కోసం వెతుకుతున్నారు. అయస్కాంతానికి వచ్చిన చిల్లర డబ్బులు వారికి ఆర్థికంగా కొంత ఆసరగా ఉంటుందని అక్కడున్న వారు తెలిపారు.

–సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నిజామాబాద్

శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి





వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వీవీ హరగోపాల్.. హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వీవీ హరగోపాల్ సూచించారు. తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం అప్లైయిడ్ స్టాటిస్టిక్స్ (సాంఖ్యాక శాస్త్రం) విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘విజ్ఞాన శాస్త్రంలో సాంఖ్యక శాస్త్ర అనువర్తితం’ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో హరగోపాల్ ప్రధాన వక్తగా హాజరై, మాట్లాడారు. టిక్వువల్ అనాలసిస్‌ను ఉపయోగించి ‘డాటా’ విశ్లేషణ చేయడంలో మెళకువలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రెండో సెషన్‌లో సీఈఎస్ఎస్ (సెస్) ప్రొఫెసర్ రవి మాట్లాడుతూ.. ‘సంప్లింగ్ పద్ధతులు, నూతన ఆవిష్కరణలు’ అంశాలపై వివరించారు. వర్క్‌షాప్‌లో తెయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, సైన్స్ డీన్ ప్రొఫెసర్ అరుణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం కట్టడం సారూ..?



నాలా మధ్యలో నిర్మిస్తున్న ప్రహరీ

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం ఇష్టారీతిన నిర్మిస్తున్నారు. బడి పక్కన ఉన్న నాలాను ఆక్రమించి నాలాలో సగం వరకు ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ఇదేం కట్టడం సారూ! అంటు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొండ ప్రాంతాల నుంచి వర్షపు నీరు ప్రవహించుటకు గతంలో నాలా నిర్మించారు. పాఠశాలకు ఇదివరకు ఉన్న ప్రహరీని నాలా వరకు నిర్మించారు. ప్రస్తుతం పాఠశాలకు నూతన ప్రహరీని నాలా వరకు కాకుండా, నాలాలో సగం వరకు నిర్మిస్తున్నారు. ఒకవేళ ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వస్తే ప్రహరీ నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే రూ.లక్షల ప్రజాధనం వరదపాలు కావాల్సిందే. గత వర్ష కాలంలో బాల్కొండ గ్రామం చెరువును తలపించేలా నీరు నిలిచింది. దీంతో హుటాహుటిన అధికారులు జేసీబీలో నాలాల్లో పూడికను తొలగించారు. ప్రస్తుతం నాలాకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నారు.అధికారులను సంప్రదించగా తమకేమి తెలియదు అంటు మాట దాటవేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాలాకు అడ్డుగా నిర్మిస్తున్న నిర్మాణం వెనుక కథను తేల్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : విద్యార్థు లు సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను చేపట్టాలని జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ అన్నారు. మంగళవారం నగరంలోని స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొని వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్‌టీవో వెంకట రమణ, విజయానందరావు, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, వీరేశం, దూప్‌సింగ్, జ్యోతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కిరాయి పేరుతో కార్ల తాకట్టు

ఖలీల్‌వాడి: కార్లను నెలవారి కిరాయి పేరిట అగ్రిమెంట్లు చేసుకొని తాకట్టు పెట్టిన ఘటన నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని కోటగల్లికి చెందిన రాజేష్ దాదాపు 25 కార్లను నెలసరి కిరాయిల పేరిట ఒప్పందం కుదుర్చుకొని, భద్రాది కొత్తగూడెం జిల్లాలో వివిధ శాఖల అధికారులకు రెంట్‌కు ఇస్తానని కారు ఓనర్లతో అగ్రిమెంటు చేసుకున్నారు. అయితే ఈ కార్లను తీసుకెళ్లిన రాజేష్ అక్కడ ఉన్న కొంతమంది ఉద్యోగులకు, యువకులకు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోని ఒక కారు ఓనర్‌కు రాజేష్ డబ్బులు చెల్లించకపోవడంతో కారు విషయమై పలుమార్లు అడిగినట్లు తెలిసింది. అయితే డబ్బుల విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన సదరు ఓనర్ ఆ కారుకు ఏర్పాటు చేసిన జీపీఎస్‌తో కొత్తగూడెంలో ఉన్నట్లు గుర్తించి మూడో టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కొత్తగూడెం వెళ్లి కారుతో పాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగరంతోపాటు ఇందల్వాయి, తదితర ప్రాంతాల్లో కార్లను కిరాయికి తీసుకొని కొత్తగూడెంలో రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు తీసుకొని కార్లను తాకట్టు పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు కొన్ని కార్లను కొత్తగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రాజేష్ కోసం మూడో టౌన్ పోలీసులు గాలిస్తున్నారు. రాజేష్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

‘కంటి వెలుగు ఖర్చు’లో కక్కుర్తి

- భోజనం డబ్బులు నొక్కేస్తున్న అధికారులు!
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



కంటి వెలుగు శిబిరం (ఫైల్)

నిజామాబాద్ సిటీ: కంటి వెలుగు శిబిరాల సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే డబ్బులలో కొంతమంది మెడికల్ ఆఫీసర్లు కక్కుర్తి పడుతున్నారు. జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు గత డిసెంబర్ 19న ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేయగా ఒక్కో బృందంలో మెడికల్ ఆఫీసర్ 1, అప్తామెలోజిస్ట్ 1, డాటా ఎంట్రీఆపరేటర్1, ఏఎన్ఎం 1, సూపర్‌వైజర్ 1, ఆశవర్కర్లు 2 మొత్తం 8 మంది ఉన్నారు. వీరికి ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం చాయ్ కోసం ప్రభుత్వం నిత్యం రూ. 1500లు ఇస్తోంది. ఈ డబ్బులను ప్రభుత్వం మెడికల్ ఆఫీసర్ల ఖాతాలో వేస్తే, మెడికల్ ఆఫీసర్లు డ్రా చేసి సిబ్బందికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇందులో కొంతమంది మెడికల్ ఆఫీసర్లు భోజనం ఖర్చులకు ఇచ్చే డబ్బులలో కక్కుర్తి పడుతూ రూ. 1000 మాత్రమే సిబ్బందికి అందిస్తూ, రూ. 500 తమ జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డబ్బులు సిబ్బందికి సరిపోక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిగురించి అడిగితే మెడికల్ ఆఫీసర్లు నుంచి ఏమైనా ఇబ్బందులు వస్తాయోనని సిబ్బంది భయపడుతూ వారు ఇచ్చిందే తీసుకుంటూ సర్దుకుపోతున్నారు.

కొన్నిచోట్ల మొత్తం డబ్బులు ఆఫీసర్లకే..

కొన్ని గ్రామాలలో ప్రజాప్రతినిధులే కంటి వెలుగు శిబిరాల సిబ్బందికి నిత్యం భోజన సదుపాయం కల్పిస్తున్నారు. సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ప్రజాప్రతినిధులే అన్ని వసతులు కల్పిస్తున్నారు. దీంతో సిబ్బందికి ఇవ్వవలసిన డబ్బులు మొత్తం ఆయా మెడికల్ ఆఫీసర్లే తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కంటి వెలుగు శిబిరం కార్యక్రమం మొత్తం 100 రోజులపాటు కొనసాగుతుండటంతో డబ్బులకు కక్కుర్తి పడుతున్న మెడికల్ ఆఫీసర్ల తీరుపై కంటి వెలుగు శిబిరం సిబ్బంది లోలోపల మదనపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తమకు సక్రమంగా డబ్బులు ఇప్పించాలని సిబ్బంది కోరుతున్నారు.

విచారణ చేయిస్తాం..

కంటి వెలుగు శిబిరాల సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే భోజనం ఖర్చుల డబ్బులలో అవినీతికి పాల్పడుతున్న మెడికల్ ఆఫీసర్లపై తగు విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. అలాంటిది ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. ఏ సిబ్బంది కూడా ఈ విషయంలో ఫిర్యాదు చేయలేదు.

– సుదర్శనం, జిల్లా ఆరోగ్యశాఖాధికారి, నిజామాబాద్

పైరవీ ఉంటేనే రుణాలు!

- మైనార్టీ రాయితీ రుణాలలో అధికారుల నిర్వాకం
- ఇంటర్వ్యూలు నామమాత్రమేనంటున్న దరఖాస్తుదారులు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు అన్వర్. మోర్తాడ్‌లో బేకరీ షాపును నిర్వహిస్తున్నాడు. తన దుకాణాన్ని ఇంకా వృద్ధి చేయడానికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై ఇచ్చే రుణం ఉపయోగపడుతుందని ఆశించి, రుణం కోసం దరఖాస్తు చేశాడు. ఈక్రమంలో ఇటీవల లబ్ధిదారుల ఎంపిక కోసం మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కానీ లబ్ధిదారుల ఎంపిక జాబితాలో అన్వర్ పేరు లేదు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలు చోటుచేసుకున్నాయని తెలుస్తోంది. ఇది ఒక్క మోర్తాడ్‌లోనే కాదు జిల్లాలో అనేక చోట్ల ఇలానే జరుగుతోంది.

మోర్తాడ్(బాల్కొండ): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి, వ్యాపార వృద్ధి కోసం యువతకు రాయితీపై రుణాలు అందిస్తోంది. కానీ అర్హులకు దక్కాల్సిన రాయితీ రుణాలు పక్కదారి పడుతున్నాయి. సంబంధిత అధికారులు పైరవీ చేసిన వారికే రుణాలను మంజూరు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు సూచించిన వారికే రుణాల పంపిణీ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. పైరవీ చేసిన వారికే రుణం ఇచ్చినప్పుడు ఇంటర్వ్యూలు ఎందుకని అనేక మంది ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో 324 యూనిట్లు..

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలను అందించడానికి జనవరిలో నోటిఫికేషన్‌ను జారీ చేశారు. జిల్లాలో 324 యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికార యంత్రాంగం నిర్దేశించింది. చాలా కాలం తరువాత రాయితీ రుణాల పంపిణీ కోసం నోటిఫికేషన్ జారీ కావడంతో అనేక మంది రుణాల కోసం దరఖాస్తులు అందించారు. జిల్లా వ్యాప్తంగా 13,105 దరఖాస్తులు అందాయి. ఒక్కో యూనిట్‌కు 50మంది నుంచి వంద మంది పోటీ పడ్డారు. ఇంటర్వ్యూలను ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు నిర్వహించినా.. ఎంపిక చేయాల్సిన లబ్ధిదారులను మాత్రం అధికార పార్టీ నాయకులు సూచించారని ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నాయకుల జోక్యం మితిమీరడం వల్ల ఇంటర్వ్యూల నిర్వహణ నామమాత్రంగానే సాగిందని తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు సూచించిన వారికి రుణం ఇచ్చినప్పుడు దరఖాస్తుల స్వీకరణ, ఇంటర్వ్యూలను నిర్వహించి కాలయాపన చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనిట్ల సంఖ్యను పెంచినా కొంతమంది అర్హులైనవారికి న్యాయం జరిగేదనే అభిప్రాయం వ్యక్తమైతుంది.

అర్హులకు అన్యాయం..



మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం వల్ల అర్హులైన వారికి అన్యాయం జరిగి ఉండొచ్చు. యూనిట్ల సంఖ్యను పెంచి ఉంటే ఎక్కువ మందికి లబ్ధి జరిగేది. అర్హులకు రు ణాలు అందకపోవడం సరైంది కాదు. అధికారులు దీనికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– అజారోద్దీన్, తిమ్మాపూర్

క్రైం కార్నర్

చెరుకు తోట దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో మాకం సాయిలు అనే రైతుకు చెందిన చెరుకు తోట మంగళవారం దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. చెరుకు తోట పైనుంచి కరెంటు వైర్లు వెళ్లడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల చెరుకు తోటకు నిప్పు అంటుకొని రెండు ఎకరాల వరకు దగ్ధమైనట్లు తెలిపారు. దగ్ధమైన చెరుకు తోట విలువ రూ. 2లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు చెరుకు తోటను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుత్ చౌర్యం కేసులో రెండేళ్ల జైలు

ఖలీల్‌వాడి: కరెంట్‌ను అక్రమంగా వినియోగించుకొని విద్యుత్ చౌర్యానికి పాల్పడిన లకావత్ ప్రేమ్‌కు రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ రావు మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. సిరికొండ మండలంలోని ఒన్నాజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దూల్ తండాకు చెందిన ప్రేమ్ తన ఇంటికి విద్యుత్ కార్యాలయం అనుమతి లేకుండా విద్యుత్‌ను వినియోగించాడు. దీంతో ఏఈ ధారావత్ కిషన్, లైన్‌మెన్ గోలి శ్రీనివాస్‌తో కలిసి డిసెంబర్ 30, 2016న స్థల పరిశీలన చేయగా.. విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయింది. అధికారులు ఈమేరకు విద్యుత్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.5,918ల విద్యుత్ చౌర్యం జరిగినట్లు అధికారులు కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విద్యుత్ చౌర్యం చేసినట్లు నిర్ధారిస్తూ ప్రేమ్‌కు రెండు సంవత్సరాల జైలుశిక్ష తోపాటు రూ.35వేల 508 జరిమానాను జడ్జి విధించారు. జరిమానా చెల్లించని యెడల అధనంగా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపులకు వివాహిత బలి



రెంజల్(బోధన్): పెళ్లి జరిగి పన్నెండు సంవత్సరాలు పూర్తయిన భర్త అదనపు కట్నం కోసం వేధించడంతో భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై పండ్ల సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన రజిత(24)ను పన్నెండేళ్ల క్రితం పెద్దలు వీరన్నగుట్టకు చెందిన భీమరాజ్‌తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో పెద్దల సమక్షంలో వరుడికి కట్నకానుకలు అందించారు. కానీ ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. దీంతో గతంలో రెండు, మూడు సార్లు ఆమె ఆత్మహత్యకు యత్నించింది. పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా అతడు మారలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి వేధింపులు భరించలేక ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



మహేష్(ఫైల్)

కామారెడ్డి టౌన్: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామానికి చెందిన దుమాల మహేష్(27) సోమవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భూమిని కబ్జా చేశాడని, ధరణిలో తన పేరిట భూమి రాకుండా చేస్తున్నాడని మనస్తాపం చెంది విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అయితే గ్రామానికి చెందిన సదరు వ్యక్తి నుంచి మహేష్ తల్లిదండ్రులు సాదాబైనామ ద్వారా 36 గుంటల భూమి కొనుగోలు చేశారన్నారు. కానీ ఆ భూమి ఇంకా అమ్మిన వ్యక్తి పేరునే ధరణిలో చూపిస్తుందన్నారు. మూడేళ్లుగా ధరణిలో తమ పేరిట మార్చాలని కోరినా చేయడం లేదని, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసుకున్నారన్నారు. ఈవిషయమై దేవునిపల్లి పోలీసులను వివరణ కోరగా కుటుంబంలో గొడవల కారణంగా మహేష్ ఆత్మహత్యాయత్నం చేసినట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసారని ఎస్సై తెలిపారు.

ప్రహరీ విషయంలో ఘర్షణ

- భిక్కనూరు మాజీ సర్పంచ్‌కు తీవ్రగాయాలు
- పరిస్థితి విషమం హైదరాబాద్‌కు తరలింపు



భిక్కనూరు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఇంటి ప్రహరీ విషయంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో భిక్కనూరు మాజీ సర్పంచ్ చంద్రపు సత్యనారాయణరెడ్డి (సత్యంరెడ్డి)కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి హై దరాబాద్‌కు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా బీఎ స్పీ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దబచ్చగారి శ్రీధర్‌రెడ్డి తమ ప్రహరీని కూల్చివేస్తుండగా.. పక్కింట్లో ఉన్న సత్యానారాయణరెడ్డితో వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు జ్ఞానప్రకాశ్‌రెడ్డితో పాటు మరో నలుగురు గుణపంతో పాటు, ఎడ్లబండి కాడితో సత్యంరెడ్డిపై దాడి చేయగా.. తీవ్రంగా గాయపడ్డారు. ఈమేరకు సత్యంరెడ్డి భార్య శోభాంజలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.